నమస్తే తెలంగాణ
నిర్మల్
5 | నిజామాబాద్, శుక్రవారం 15 మార్చి 2024 | NIRMAL

కప్పర్ల యువతను ఆదర్శంగా తీసుకోవాలి..

కప్పర్ల గ్రంథాలయాన్ని ప్రారంభిస్తున్న అదనపు కలెక్టర్ వికాస్

తాంసి, మార్చి 14 : విరాళాల సేకరణతో గ్రంథాలయ నిర్మాణం చేపట్టిన కప్పర్ల గ్రామ యువతను ఆదర్శంగా తీసుకోవాలని అడిషనల్ కలెక్టర్ వికాస్ అన్నారు. గురువారం మండలంలోని కప్పర్ల గ్రామంలో నూతన గ్రంథాలయాన్ని నాయకులతో కలిసి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. చదువుతోనే భవిష్యత్ మారుతుందని అన్నారు. యువత ప్రభుత్వ ఉద్యోగాలు సాధించేలా గ్రంథాలయాన్ని వినియోగించుకోవాలని కోరారు. గ్రంథాలయానికి కావాల్సిన పుస్తకాలను అందించేందుకు కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ రాజు, ఎంపీపీ మంజుల, మాజీ సర్పంచ్ సదానందం, ఎంపీటీసీ భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి కృషి

ఎమ్మెల్యే రామారావు పటేల్

పాఠశాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రామారావు పటేల్

ముథోల్, మార్చి 14 : విద్యాభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని ముథోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్ అన్నారు. గురువారం ముథోల్ లోని కస్తుర్బా గాంధీ పాఠశాలలో రూ.2.30 కోట్లతో అదనపు గదుల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. వైద్యం, విద్యపై ప్రత్యేక దృష్టి సారించినట్లు పేర్కొన్నారు. నియోజకవర్గవ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలలోని సమస్యలు, విద్యార్థులకు కల్పించాల్సిన అవసరాలపై నివేదిక ఇవ్వాలని ఎంఈవోలకు సూచించారు. ఈ సందర్భంగా పాఠశాలను పరిశీలించారు. అనంతరం ఎమ్మెల్యేను పలువురు నాయకులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో డీఈవో రవీందర్‌రెడ్డి, ఎంఈవో మైసాజీ, కస్తుర్బాగాంధీ ప్రిన్సిపాల్ ఫరాత్ బేగం పాల్గొన్నారు.

గెలుపే లక్ష్యం

పార్లమెంట్ ఎన్నికల్లో కలిసికట్టుగా పనిచేయాలి..

- ఎవరికీ టికెట్ ఇచ్చినా విజయం కోసం కృషి చేయాలి..
- ప్రజాక్షేత్రంలో ఉంటూ సమస్యలను పరిష్కరించాలి..
- కాంగ్రెస్ పార్టీపై ప్రజల్లో వ్యతిరేకత మొదలైంది..
- ఆదిలాబాద్ పార్లమెంట్ సీటు మనదే కావాలి..
- బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు
- ఆదిలాబాద్ పార్లమెంట్ ముఖ్యనేతల సమావేశం

ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ ముఖ్య నేతల సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, సమావేశంలో పాల్గొన్న నాయకులు

ఆదిలాబాద్, మార్చి 14(నమస్తే తెలంగాణ) : పార్లమెంట్ ఎన్నికల్లో ఆదిలాబాద్ నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు గెలుపే లక్ష్యంగా పని చేయాలని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ సూచించారు. గురువారం హైదరాబాద్‌లోని నందినగర్‌లో నిర్వహించిన ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ ముఖ్యనేతల సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికల్లో పార్టీ విజయం కోసం అనుసరించాల్సిన విధానంపై నాయకులకు దిశానిర్దేశం చేశారు. ఎన్నికల్లో గెలుపు, ఓటములు సహజమని.. నాయకులు ప్రజాక్షేత్రంలో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. కాంగ్రెస్ పార్టీపై అతి తక్కువ కాలంలోనే ప్రజల నుంచి వ్యతిరేకత వచ్చిందన్నారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో దేశంలో ఎక్కడా లేని విధంగా రైతుల కోసం పలు సంక్షేమ పథకాలను అమలు చేశామని గుర్తు చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రైతులు ఇబ్బందులు పడుతున్నారని మండిపడ్డారు. ఎన్నికల్లో ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఆదిలాబాద్ పార్లమెంట్ అభ్యర్థి ఎవరిని ప్రకటించినా.. అందరం కలిసికట్టుగా పనిచేసి అభ్యర్థిని గెలిపిస్తామని ముఖ్యనాయకులు తెలిపారు. ఈ సమావేశంలో మాజీ మంత్రి, బీఆర్ఎస్ పార్టీ ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న, బోథ్, ఆసిఫాబాద్ ఎమ్మెల్యేలు అనిల్ జాదవ్, కోవ లక్ష్మి, ఎంఎల్‌సీ దండే విఠల్, నాయకులు వేణుగోపాలాచారి, జాన్సన్ నాయక్, ఆత్రం సక్కు, సత్యనారాయణగౌడ్, రాజేందర్, తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థిగా ఆత్రం సక్కు

- ఆదిలాబాద్ పార్లమెంట్ అభ్యర్థి ఖరారు
- మాజీ ఎమ్మెల్యే పేరును ప్రకటించిన కేసీఆర్

ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కు

ఆదిలాబాద్, మార్చి 14(నమస్తే తెలంగాణ) : ఆదిలాబాద్ లోక్‌సభ స్థానానికి బీఆర్ఎస్ అభ్యర్థిగా ఆత్రం సక్కు పోటీ చేయనున్నారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఆయన పేరును ప్రకటించారు. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో ఆసిఫాబాద్ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందిన ఆత్రం సక్కుకు ఈసారి ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం నుంచి ఎంపీగా పోటీ చేయనున్నారు. గురువారం హైదరాబాద్‌లో కేసీఆర్ నివాసగృహంతో ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని బీఆర్ఎస్ ముఖ్యనేతలతో సమావేశం ఏర్పాటు చేసి దిశానిర్దేశం చేశారు. సమావేశం అనంతరం కొన్ని గంటల వ్యవధిలోనే సక్కు పేరును ప్రకటించారు.

అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు మెజారిటీ

ఆదిలాబాద్ పార్లమెంట్ పరిధిలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలు ఉండగా బోథ్, ఆసిఫాబాద్ నియోజకవర్గాల్లో బీఆర్ఎస్ అభ్యర్థులు విజయం సాధించారు. ఆదిలాబాద్, ఖానాపూర్, కాగజ్‌నగర్ నియోజకవర్గాల్లో తక్కువ ఓట్లతో ఓడిపోయారు. ఆదిలాబాద్ లోక్‌సభ పరిధిలోని ఆదిలాబాద్, బోథ్, ఖానాపూర్, నిర్మల్, మథోల్, సిర్పూర్, ఆసిఫాబాద్ నియోజకవర్గాల్లో బీఆర్ఎస్ బలంగా ఉంది. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో పార్లమెంట్ నియోజకవర్గంలో బీఆర్ఎస్‌కు మెజారిటీ వచ్చింది. ఏడు నియోజకవర్గాల్లో బీఆర్ఎస్ 4,65,476 ఓట్లు రాగా, బీజేపీకి 4,48,967 ఓట్లు, కాంగ్రెస్‌కు 2,52,281 ఓట్లు వచ్చాయి. బీజేపీ కంటే బీఆర్ఎస్‌కు 16,509 ఓట్లు అధికంగా వచ్చాయి. ఆదిలాబాద్ లోక్‌సభ నియోజకవర్గ పరిధిలో బీఆర్ఎస్ బలంగా ఉంది. ఇద్దరు ఎమ్మెల్యేలు, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు, మున్సిపాలిటీ చైర్మన్లు, ఇతర ప్రజాప్రతినిధులు ఎక్కువ సంఖ్యలో ఉన్నారు. దీంతో బీఆర్ఎస్ అభ్యర్థి గెలుపు అవకాశాలు చాలా వరకు ఉన్నాయి.

కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న ఐఎఫ్‌టీయూ నాయకులు

కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం

ఎదులాపురం, మార్చి 14 : కేంద్ర ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని, నాలుగు లేబర్‌కోడ్స్ రద్దు చేయాలని ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటనారాయణ డిమాండ్ చేశారు. కేంద్ర కార్మిక సంఘాలు, సంయుక్త కిసాన్ మోర్చా పిలుపుతో గురువారం కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా వెంకటనారాయణ మాట్లాడుతూ.. పెరిగిన ధరలకు అనుగుణంగా కనీస వేతనం రూ.26 వేలు అమలు చేయాలని కోరారు. కనీస మద్దతు ధర ఇవ్వాలని, మూడు రైతాంగ నల్ల చట్టాలను రద్దు చేస్తామని ఇచ్చిన హామీలను అమలు చేయలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్తామని హెచ్చరించారు. జిల్లా నాయకులు గౌరాల సుభాష్, నర్సింగ్, దేవీదాస్, డీపీఎస్‌యూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు హరీశ్, మడావి గణేశ్, పీవోడబ్ల్యూ జిల్లా కన్వీనర్ దుర్గం కళావతి పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీ ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న మల్లేశ్

అప్పు చెల్లించాలని దీక్ష

దస్తురాబాద్, మార్చి 14 : తన వద్ద తీసుకున్న అప్పు డబ్బులు తిరిగి చెల్లించాలని డిమాండ్ చేస్తూ పంచాయతీ కార్యాలయం ఎదుట నిరహార దీక్ష చేపట్టిన ఘటన గురువారం చోటుచేసుకున్నది. చెన్నూర్‌కు చెందిన కనగంటి మల్లేశ్ అదే గ్రామానికి చెందిన తిప్పని సతీశ్‌కు రూ.47 వేల అప్పు ఇచ్చాడు. తిరిగి ఇవ్వకపోవడంతో బుట్టాపూర్ పంచాయతీ కార్యాలయం ఎదుట దీక్ష చేపట్టాడు. పంచాయతీ దృష్టికి తీసుకు రావడం కోసం దీక్ష చేపట్టినట్లు, నాకు రావాల్సిన డబ్బులను ఇప్పించేలా చూడాలని విజ్ఞప్తి చేశాడు.

పది పరీక్షలకు మానసికంగా సిద్ధం చేయండి..

డీఎంహెచ్‌వో నరేందర్ రాథోడ్

జూమ్ మీటింగ్‌లో వైద్యాధికారులతో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో నరేందర్ రాథోడ్

ఎదులాపురం, మార్చి 14 : పదో తరగతి పరీక్షలకు సన్నద్ధమవుతున్న విద్యార్థులకు సూచనలు, సలహాలు ఇవ్వాలని వైద్యాధికారులు డీఎంహెచ్‌వో నరేందర్ రాథోడ్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా మానసిక ఒత్తిడిని ఎదుర్కొనేందుకు అనుసరించాల్సిన వ్యూహాలు, పాటించాల్సిన విషయాలపై రిమ్స్ అసిస్టెంట్ ప్రొఫెసర్ ఓంప్రకాశ్ ఆధ్వర్యంలో వైద్యాధికారులతో జూమ్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో వైద్యాధికారులకు దిశానిర్దేశం చేశారు. పరీక్షలనేవి జీవితంలో ఒక భాగం మాత్రమేనని, వాటికి భయపడి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని సూచించాలని పేర్కొన్నారు. ప్రణాళికతో ప్రిపరేషన్ కొనసాగించాలని, రోజు వ్యాయామం చేస్తూ ఉల్లాసంగా ఉండాలనే విషయాన్ని చెప్పాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్‌సీడీ ప్రొగ్రాం అధికారి శ్రీధర్, మెడికల్ సైకాలజిస్ట్ శ్రీకాంత్, సోషల్ వర్కర్ చిరంజీవి ఉన్నారు.

మాట్లాడుతున్న అంతర్రాష్ట్ర ఎక్సైజ్ అధికారులు

అంతర్రాష్ట్ర ఎక్సైజ్ అధికారుల భేటీ

ఎదులాపురం, మార్చి 14 : పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో తెలంగాణ-మహారాష్ట్ర సరిహద్దు జిల్లాల ఎక్సైజ్ అధికారులు సమావేశాన్ని ఏర్పాటు చేసుకున్నారు. గురువారం ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని ఎక్సైజ్ కార్యాలయంలో డిప్యూటీ కమిషనర్ నరసింహారెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రెండు రాష్ట్రాల మధ్య దేశీదారు, మద్యం, నాటు సారా, గంజాయి రవాణా విక్రయాలను అరికట్టేందు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. సరిహద్దు ప్రాంతాల్లో చెక్‌పోస్టుల ఏర్పాటు, నేరస్తుల సమాచారం ఇచ్చిపుచ్చుకోవాలని పేర్కొన్నారు. సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి, కలిసి దాడులు నిర్వహించాలన్నారు. ఈ సమావేశంలో ఎక్సైజ్ సూపరింటెండెంట్ హిమశ్రీ, మంచిర్యాల, ఆసిఫాబాద్ జిల్లా డీపీఈవోలు నందగోపాల్, జ్యోతికిరణ్, చంద్రాపూర్ జిల్లా ఎక్సైజ్ అధికారులు సంజయ్‌పాటిల్ పాల్గొన్నారు.

కౌంటింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్పీ

కౌంటింగ్ కేంద్రాలను పరిశీలించిన కలెక్టర్, ఎస్పీ

ఎదులాపురం, మార్చి 14 : రానున్న పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో గురువారం ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా, ఎస్పీ గౌష్ ఆలంతో కలిసి కౌంటింగ్ కేంద్రాలను పరిశీలించారు. టీటీడీసీ, సోషల్ వెల్ఫేర్ బాలికల గురుకుల పాఠశాలలను పరిశీలించి, అధికారులకు పలు సూచనలు చేశారు.

అయ్యో పాపం

- అప్పుడే పుట్టిన పసికందును వదిలేసిన గుర్తు తెలియని మహిళ
- ముళ్లపొదల్లో ఏడుపులు వినిపించడంతో దగ్గరకు తీసుకున్న స్థానికులు
- దవాఖానలో చికిత్స అనంతరం శిశుగృహకు తరలింపు
- భీంపూర్ మండలంలోని నిపాని గ్రామంలో ఘటన

నిపాని శివారులోని ముళ్ల పొదల పక్కన పసికందు

భీంపూర్, మార్చి 14 : ఆదిలాబాద్ జిల్లా భీంపూర్ మండలంలోని నిపాని గ్రామంలో గురువారం వేకువజామున అమానవీయ ఘటన వెలుగు చూసింది. సభ్యసమాజం తలదించుకునేలా ఓ గుర్తు తెలియని మహిళ అప్పుడే పుట్టిన మగ శిశువును వదిలేసి వెళ్లింది. స్థానికులు, పోలీసులు, వైద్య సిబ్బంది కథనం ప్రకారం.. నిపాని గ్రామ శివారులోని ముండ్ల పొదల పక్కన ఉదయం ఏడు గంటలకు శిశువు రోదనలు వినిపించాయి. అటువైపుగా చేలకు వెళ్తున్న రైతులు గమనించి గ్రామ పెద్దలు రాజన్న, అనిల్‌లకు సమాచారం ఇచ్చారు. వారు భీంపూర్ ఎస్ఐ ప్రదీప్‌కుమార్‌కు ఫోన్ ద్వారా తెలుపగా.. ఘటనా స్థలానికి చేరుకుని పసికందును పరిశీలించారు. స్థానిక మహిళలు పోలీసుల సూచనలతో ఆటోలో భీంపూర్ పీహెచ్‌సీకి తరలించారు. వైద్యుడు నిఖిల్‌రాజ్, సిబ్బంది జ్ఞానేశ్వర్, గంగాధర్ నవజాత శిశువుకు చికిత్స అందజేశారు. ఐసీడీఎస్ వారు వచ్చి 1098 వాహనంలో రిమ్స్‌కు తరలించారు. శిశువు ఆరోగ్యంగానే ఉండడంతో శిశుగృహకు చేర్చారు. కాగా.. స్థానిక మహిళలే ఆ శిశువును దత్తత తీసుకుంటామని ముందుకొచ్చారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఐసీడీఎస్ రక్షణలో ఉంచుతారని, అనంతరం దత్త తీసుకోవచ్చని అధికారులు తెలిపారు.

అమ్మ ఆదర్శ కమిటీలను ఏర్పాటు చేయాలి..

- వీటి ద్వారానే పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలి..
- వీసీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి

వీసీలో మాట్లాడుతున్న సీఎస్ శాంతికుమారి, హాజరైన కలెక్టర్, పీవో, అదనపు కలెక్టర్లు

ఎదులాపురం, మార్చి 14 : ప్రతి పాఠశాలలో అమ్మ ఆదర్శ కమిటీలను జూన్ 10వ తేదీ వరకు ఏర్పాటు చేయాలని, వీటి ద్వారానే మౌలిక సదుపాయాలు కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి తెలిపారు. గురువారం రాష్ట్రస్థాయి ఉన్నతాధికారులతో కలిసి ఆమె కలెక్టర్‌లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ.. మహిళా శక్తి కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ పాఠశాల నిర్వహణ బాధ్యతలను స్వశక్తి సంఘాలకు అప్పగిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు. యూడీఐఎస్ 2023 డేటా ప్రకారం.. చేపట్టాల్సిన పనులను గుర్తించి, పరిపాలన అనుమతులు మంజూరు చేసి జిల్లా సమాఖ్యకు అప్పగించాలన్నారు. కలెక్టర్ రాజర్షి షా, పీవో ఖుష్బూ గుప్తా, అదనపు కలెక్టర్ శ్యామలాదేవి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఆర్‌సీవో గోపీచంద్

ఆర్‌సీవో ఆకస్మిక తనిఖీ

ఖానాపూర్, మార్చి 14 : ఖానాపూర్ పట్టణంలోని మహాత్మా జ్యోతిబా పూలే(బాలుర) పాఠశాలను గురువారం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఆర్‌సీవో గోపీచంద్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులతో సమీక్షా సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. అనంతరం మాట్లాడుతూ.. త్వరలో జరుగబోయే పదో తరగతి పరీక్షల్లో విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణతను సాధించడానికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ విశ్వేశ్వర్ ఉన్నారు.

సోయా కొనుగోలును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే పాయల్ శంకర్

సోయా కేంద్రం ప్రారంభం

జైనథ్, మార్చి 14 : జైనథ్ వ్యవసాయ మార్కెట్ కార్యాలయ ఆవరణలో మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సోయా కొనుగోలు కేంద్రాన్ని అధికారులు, నాయకులతో కలిసి గురువారం ఎమ్మెల్యే పాయల్ శంకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మద్దతు ధరలేని కారణంగా సోయా పంటను విక్రయించుకోకపోతే, కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడి ప్రభుత్వ రంగ సంస్థలతో కొనుగోలు చేయిస్తానని హామీ ఇచ్చారు. పాయల్ ఫౌండేషన్ ద్వారా రైతులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించగా.. రైతులకు ఎమ్మెల్యే వడ్డించారు. బీజేపీ మండల శాఖ అధ్యక్షుడు రాందాస్, దీపాయిగూడ ఎంపీటీసీ కరుణాకర్ రెడ్డి, మార్కెట్ కార్యదర్శి మధూకర్ పాల్గొన్నారు.

తాటిగూడలో చెక్‌డ్యాం నిర్మించవద్దని ఎమ్మెల్యేకు దండం పెడుతున్న రైతు

ఎమ్మెల్యే బొజ్జును అడ్డుకున్న రైతులు

- దండం పెడుతం, కాళ్లు మొక్కుతం చెక్ డ్యాంను నిర్మించొద్దు..
- మా పంటలు ముంపునకు గురవుతాయని ఆవేదన
- అన్నదాతల మాటను పట్టించుకోకుండా నిర్మాణానికి భూమిపూజ

పెంబి, మార్చి 14 : 'ఎమ్మెల్యే బొజ్జు గారూ.. తాటిగూడ వద్ద కడెం వాగుపై చెక్‌డ్యాం నిర్మిస్తే మా పంట పొలాలు ముంపునకు గురవుతాయి. వేరే ప్రాంతంలో రీ డిజైన్ చేసి నిర్మించండి.' అంటూ రైతులు ఎమ్మెల్యే బొజ్జును గురువారం అడ్డుకున్నారు. దండం పెడుతూ కాళ్లు మొక్కి వేడుకున్నారు. దీనికి స్పందించిన ఎమ్మెల్యే.. చెక్‌డ్యాం ఎత్తు, చెక్‌డ్యాం వల్ల కలిగే లాభాలను వివరించారు. కొంత మందికి నష్టం కలిగినా చాలా మందికి లాభం జరుగుతుందన్నారు. అనంతరం రూ.6.50 కోట్లతో నిర్మించనున్న చెక్‌డ్యాం నిర్మాణానికి భూమిపూజ చేసి పనులను ప్రారంభించారు. ఇటిక్యాలలో రూ.5.30 కోట్లు, మందపల్లిలో రూ.1.80 కోట్లతో నిర్మించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఖానాపూర్ మున్సిపల్ చైర్మన్ సత్యం, ఇరిగేషన్ ఈఈ లక్ష్మి, డీఈ సురేందర్, ఏఈ ఉదయ్ పాల్గొన్నారు.

కడెం మరమ్మతుకు భూమిపూజ

కడెం, మార్చి 14 : కడెం ప్రాజెక్టు మరమ్మతు పనులకు గురువారం ఎమ్మెల్యే బొజ్జు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి ప్రాజెక్టుకు రూ.5.46 కోట్లు మంజూరు చేశారని తెలిపారు. రైతును రాజు చేయడమే మా ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. మరమ్మతుల కారణంగా ఈసారి క్రాప్ హాలీడే ప్రకటించామని గుర్తు చేశారు. కుష్టీ నిర్మాణ పనులు కూడా త్వరలోనే చేపడతామని వెల్లడించారు.

వ్యవసాయ విజ్ఞానాన్ని విస్తరించాలి..

- నిర్మల్ కలెక్టర్ ఆశీష్‌సంగ్వాన్

నిర్మల్ టౌన్, మార్చి 14 : వ్యవసాయ రంగంలో యాంత్రీకరణను ఉపయోగించి అధిక దిగుబడులు సాధించేలా జిల్లా వ్యవసాయశాఖ సాంకేతిక విజ్ఞానాన్ని రైతులకు చేరువ చేయాలని కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ అన్నారు. గురువారం కలెక్టర్ కార్యాలయంలో ఇండియన్ ఫార్మర్స్ ఫర్టిలైజర్ కో-ఆపరేటివ్ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన డ్రోన్ వ్యవసాయ యాంత్రీకరణ పని విధానాన్ని ప్రారంభించారు. వీటివల్ల యువతకు ఉపాధి అవకాశాలు మెరుగవుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అంజీప్రసాద్, వికాస్, సాగర్, నవీన్ పాల్గొన్నారు.

ప్రజాప్రతినిధులు సహకరించాలి..

ఎదులాపురం, మార్చి 14 : పార్లమెంట్ ఎన్నికలు సజావుగా సాగేందుకు ప్రజాప్రతినిధులు సహకరించాలని ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా అన్నారు. ఆదిలాబాద్ కలెక్టరేట్‌లో గురువారం ఓటరు జాబితా, పార్లమెంట్ ఎన్నికల నిర్వహణపై వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు రాజకీయ పార్టీలు పూర్తి సహాయ, సహకారాలు అందించాలన్నారు. ఇంటి వద్ద నుంచి ఓటు హక్కు వినియోగించుకునేందుకు 85 ఏండ్లపైబడి ఉన్న వృద్ధులకు పోస్టల్ బ్యాలెట్ అవకాశం ఈసీ కల్పించిందన్నారు. ఇందుకోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఓటరు జాబితాపై వచ్చే మార్పులపై సమావేశాలు ప్రతి బుధవారం ఆర్టీవో కార్యాలయంలో నిర్వహించాలన్నారు. ఈ సమావేశంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, ఎన్నికల విభాగం పర్యవేక్షకురాలు నలంద ప్రియ, వివిధ రాజకీయ పార్టీల ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

బంగల్ పేట్‌లో సర్వేను పరిశీలిస్తున్న పీవో రవీందర్‌రెడ్డి

సర్వే సమగ్రవంతంగా నిర్వహించాలి..

నిర్మల్ చైన్‌గేట్, మార్చి14 : కుష్టు వ్యాధి సర్వేను సమగ్రవంతంగా నిర్వహించాలని కార్యక్రమ నిర్వహణ అధికారి రవీందర్‌రెడ్డి అన్నారు. నిర్మల్ పట్టణంలోని బంగల్‌పేటలో కుష్టు వ్యాధి సర్వేను ఆయన గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కుష్టు వ్యాధిగ్రస్తులను గుర్తించి, వారికి సకాలంలో చికిత్స అందేలా చర్యలు తీసుకోవాలన్నారు.